క్లుప్తంగా

గడప గడపకు నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి) అన్నారు. గడప గడపకు నిధులు రూ.5 లక్షలతో స్థానిక గౌడ బజారులో పీఏసీఎస్ కార్యాలయం పక్క నుంచి గోడౌన్ మీదుగా 77 మీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పుతో నూతన సీసీ రోడ్డు నిర్మించారు. నూతన సీసీ రోడ్డు నిర్మాణాన్ని గురువారం సాయంత్రం పీఏసీఎస్ చైర్మన్ ఫణి, సొసైటీ సీఈఓ తోట కృష్ణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నిగంటి రాఘవరావు (రవి) పరిశీలించారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులోని ఆంజనేయ స్వామి వారి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం సహస్ర దీపాలంకరణ జరిగాయి. అనంతరం రాత్రి గ్రామస్తుల సహకారంతో రెండు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో లింగాకారంలో మహిళలు దీపాలు వెలిగించారు. స్వామివార్లను దర్శించుకున్న భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: రామరాజుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఉదయం 7.30 గంటలకు చిట్టిగూడూరు, మధ్యాహ్నం రామరాజుపాలెం గ్రామల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

రైస్‌మిల్లుల్లో రిజిస్టర్ల తనిఖీ



గూడూరు: ఆరుగాలం శ్రమించి రైతులు సాగు చేసిన పంటలకు మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. మండలంలోని రైస్‌మిల్లుల్లో రిజిస్టర్లను తనిఖీ చేసిన తహసీల్దార్ ధాన్యం కొనుగోళ్ల తీరును సమీక్షించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మిల్లర్లు రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించవద్దని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని, ఏ మాత్రం నిర్లక్ష్యం చూపినా తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు కె.కోటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులకు పట్టాల పంపిణీ

కోడూరు: అసైన్డ్ భూములు, లంక భూముల లీజుకు సంబంధించిన పట్టాలను శుక్రవారం రైతులకు పంపిణీ చేస్తామని తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా గురువారం తెలిపారు. స్థానిక కార్యాలయం వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

ఆడుదాం ఆంధ్రాకు దరఖాస్తు చేసుకోండి

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్రా క్రీడా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉత్సాహం ఉన్న క్రీడాకారులు నమోదు చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ జి. చంద్రయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15 ఏళ్లు పైబడిన బాలబాలికలు 1902కి కాల్ చేసి అలాగే సమీపంలోని సచివాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో ప్రావీణ్యత ఉన్న క్రీడాకారులు నమోదు చేసుకోవచ్చునన్నారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారని చెప్పారు.

డివైడర్‌ను ఢీ కొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

పెడన: రోడ్డు ప్రమాదంలో గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడివాడ నుంచి పెడన వైపునకు వస్తున్న కారు పెడన పీహెచ్‌సీ వద్ద డివైడర్‌ను ఢీ కొట్టింది. ముందు సీట్లో కూర్చున్న ఇద్దరు యువకులు గూడూరు మండలం మల్లవోలు గ్రామానికి చెందిన పటాన్ హంసలా (మున్నా) (25)కు కాళ్లకు, చేతులకు గాయాలు కాగా, పటాన్ అనస్కర్ (18)కు తలపై తీవ్ర గాయమైంది. బాధితులను పెడన పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స చేశారు. అనంతరం వీరిని మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జగనన్నే మళ్లీ రావాలి

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు
- పలుచోట్ల 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'

మర్రిపాలెం(నాగాయలంక): అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి) అన్నారు. మండలంలోని మర్రిపాలెం సచివాలయం వద్ద గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలి, పల్లెకుపోదాం కార్యక్రమాలు నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. మద్ది వెంకట నారాయణ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సచివాలయం పరిధిలోని వక్కపట్లవారిపాలెం, మర్రిపాలెం గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది, ఈటీపీఆర్‌డీ కె. అప్పలనరసమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అంబటి శ్యామ్‌ప్రసాద్, రావూరి వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ పుట్టి స్వరూపరాణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు ఎంవీ సాంబశివరావు, తోట సాయిబాబు, డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, చోడిశెట్టి మాణిక్యాలరావు, నంద్యాల కోటేశ్వరరావు, బీమా బాబూరావు పాల్గొన్నారు.

- నడకుదురు(చల్లపల్లి): సీఎం వైఎస్ జగన్ సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నాని) అన్నారు. గురువారం రాత్రి చల్లపల్లి మండలం నడకుదురులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డు, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో అమలు చేసిన తీరును వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డొక్కు దేవేంద్రరావు, గ్రామ కన్వీనర్ జంపాన అంకమ్మ, జేసీఎస్ కన్వీనర్ యడ్ల జగదీష్, నాయకులు గొరిపర్తి రమేష్, కై లే దాస్, సజ్జా బలరాం, వీరబాబు, సమీర్ పాల్గొన్నారు.
- కృత్తివెన్ను: పల్లెకుపోదాం కార్యక్రమం గురువారం కృత్తివెన్ను మండలం చినపాండ్రాక-2 సచివాలయం పరిధిలో నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె. బాపూజీ, సర్పంచ్ కె. బాయమ్మ, ఉప సర్పంచ్ పి. భాస్కరరావు, సచివాలయ కన్వీనర్ పి. శ్రీనివాసరావు, ఆర్‌బీకే చైర్మన్ శేఖర్, నాయకులు రాంబాబు, సత్యనారాయణ, తాతయ్య, బాష పాల్గొన్నారు.
- గూడూరు: ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం గూడూరు మండలం ఐదుగుళ్లపల్లి గ్రామ సచివాలయం పరిధిలో జరిగింది. సంక్షేమ పథకాల బోర్డును, వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ గూడూరు మండల కన్వీనర్ పర్లం పెదబాబు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజల జీవన స్థితిగతులలో ఎంతో మార్పు వచ్చిందని వివరించారు. జగనన్న ముఖ్యమంత్రిగా మళ్లీ రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు గరికిముక్కు మారుతి, ఆర్బీకే చైర్మన్ లుక్కా ఏలేషు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.
- బంటుమిల్లి: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం మల్లేశ్వరం సచివాలయం పరిధిలోని మల్లేశ్వరం, కొర్లపాడు గ్రామాల్లో నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ మల్లేశ్వరం, కొర్లపాడు పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో రూ. 29 కోట్లు ఖర్చు చేశారని వివరించారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, ఎంపీటీసీ పి. వీరబాబు, మాజీ సర్పంచ్ కందుల నాగేశ్వరరావు, బీసీ మండల కన్వీనర్ బొమ్మిడి నాగార్జున, చేబోయిన సముద్రుడు, జొన్నలగడ్డ పాండురంగారావు, మన్నెం బుజ్జి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నడకుదురులో కరపత్రం అందించి సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు



నాగాయలంక మర్రిపాలెంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు,అధికారులు



చినపాండ్రాకలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన నాయకులు



ఐదుగుళ్లపల్లిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పర్లం పెదబాబు

అప్రమత్తంగా ఉండండి

- ముందస్తు జాగ్రత్తలపై రైతులకు సూచనలు ఇవ్వాలి
- కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలి
- పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయండి
- పెడన నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మంత్రి జోగి రమేష్



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: డిసెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారుల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సూచనలు ఇవ్వాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పెడన నియోజకవర్గ సమస్యలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం గురువారం సాయంత్రం పెడన మార్కెట్ యార్డు సమావేశం మందిరంలో నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటలు బాగున్న నేపథ్యంలో తీవ్ర వర్షాలు అంటూ వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు అవకాశం ఉన్నంత మేరకు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గోనె సంచులు పూర్తిస్థాయిలో రైతులకు అందించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయడంతో పాటు కొత్తగా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల పరిస్థితిపై ఆరా తీసి అవసరమైన చోట్ల రోడ్లు పునర్నిర్మాణం కానీ, మరమ్మతులు కానీ చేయాలన్నారు. డ్రెయినేజీ వ్యవస్థను ఆధునీకీకరించేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి వివరించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధి మరింత వేగంగా పరుగులు పెట్టనుందని, అందుకు అధికారులు అందరూ సహకరించాలని చెప్పారు. రెవెన్యూ, గ్రామీణ నీటిపారుదల, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ, ఆరోగ్యశాఖ, రహదారులు తదితర శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో మంత్రి పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో మచిలీపట్నం ఆర్డీఓ ఎం. వాణి, పెడన నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులు నాగకుమారి, వాణి, చినబాబు, మధుసూదనరావు, చారుమతి, గంగాధర్, రత్నకుమారి, వివిధ శాఖల డివిజన్, మండల అధికారులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): రక్తహీనత ఉన్న బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి 15 రోజులకు ఒకసారి వైద్యులతో పరీక్షలు నిర్వహించాలని, బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్త్రీ, శిశు సంక్షేమం, పాఠశాల విద్య, ప్రాధాన్యత భవనాలు తదితర అంశాలపై సమీక్షించారు. సీఎస్‌కు జిల్లా ప్రగతిని కలెక్టర్ రాజాబాబు వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు అందర్ని పాఠశాల, కళాశాలల్లో చేర్పించాలన్నారు. చిన్నారులు బరువు తక్కువ ఉండకూడదని, ఎదుగుదల ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాడు - నేడు రెండో దశ పనులు డిసెంబరు 21వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. ఆర్బీకేలు, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసి జనవరి 10వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి. గీతాబాయి, డీఈఓ తాహెరా సుల్తానా, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, సీపీఓ జి. గణేష్‌కృష్ణ, సర్వశిక్షా ఏపీసీ శ్రీరాములు నాయక్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చిలకలపూడి(మచిలీపట్నం): సమాజంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. విజయానంద డిగ్రీ కళాశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. మత్తు పదార్థాలకు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా పోలీస్ వారికి కాని, తమ సంస్థకు కాని తెలియజేయాలని ఆయన సూచించారు. అనంతరం చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య, న్యాయవాది అజ్మతున్నీసా, ప్రిన్సిపాల్ ఎస్. రాజశేఖర్, డైరెక్టర్ ఎస్. సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

శివాలయాల్లో అభిషేకాలు, పూజలు

సంగమేశ్వరం(నాగాయలంక): కార్తిక మాసోత్సవాలు, సంకట హర చతుర్థి విశిష్టత నేపథ్యంలో గురువారం మండలంలోని పలు శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కార్తిక దీపాలంకరణ కార్యక్రమాలు జరిగాయి. సంగమేశ్వరంలోని 11వ శతాబ్దం నాటి పురాతనమైన గంగా పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి దేవాలయాన్ని దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో సందర్శించారు. భావదేవరపల్లి అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గ్రామ భక్త బృందం ఆధ్వర్యంలో మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. అమ్మవారికి కుంకుమార్చన, కాశీవిశ్వేశ్వరస్వామి, వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. నాగాయలంక కృష్ణాతీరంలోని శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్‌లో రామలింగేశ్వర స్వామికి భక్తులు స్వీయ అభిషేకాలు చేసుకున్నారు. నాగాయలంకలోని పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

ముగిసిన రామనామ ఏకాహం

కోడూరు: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రారంభించిన రామనామ ఏకాహం గురువారంతో ముగిసింది. ఇస్మాయిల్‌బేగ్ పేట, యర్రారెడ్డివారిపాలెం గ్రామాలకు చెందిన భక్త మండళ్ల సభ్యులు బుధవారం వేకువజామునే ఆలయ ప్రాంగణంలో ఏకాహాన్ని ప్రారంభించారు. భక్తులు 24 గంటల పాటు నిర్విరామంగా రామనామాన్ని పఠించారు. ఏకాహం ముగింపు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలచే తులసీ దళాలతో స్వామివార్లకు పూజలు చేశారు. వెంకన్న కల్యాణమూర్తులను ఆలయ మాడవీధుల వెంట ఊరేగించారు. ప్రధాన అర్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

ముమ్మరంగా వ్యవసాయ పనులు

కృత్తివెన్ను: వాతావరణ శాఖాధికారుల భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. కృత్తివెన్ను మండలంలో ఈ ఖరీఫ్‌లో రైతులు సుమారు ఏడు వేల ఎకరాలలో వరిని సాగుచేశారు. 90 శాతానికి పైగా కోతదశకు చేరుకుంది. ఈ క్రమంలో కొన్ని చోట్ల ఇప్పటికే రైతులు వరికోతలు పూర్తిచేశారు. వాయుగుండం ఏర్పడిందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో కోతలు పూర్తిచేసిన రైతులు పంటను కాపాడుకునేందుకు వడివడిగా నూర్పిళ్ల ప్రక్రియను పూర్తిచేస్తున్నారు. డిసెంబరు 4, 5 తేదీలు దాటే వరకు రైతులు కోతలు వాయిదా వేసుకోవడం మంచిదని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు.



ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్ నిరోధక చట్టంపై సీఐ ఎల్. రమేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మన టీవీ భవనంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి. ఉమారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐ రమేష్ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, ఎవరన్నా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా విద్యార్థులతో సీఐ ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ ఆర్. అంకారావు, యాంటీ ర్యాగింగ్ కమిటీ కన్వీనర్ ఎ. వీరకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

పెడన: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవి క్షేత్రంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజ, ఏకాదశి మహా రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, కోటి దీపోత్సవం జరిగాయి. కోటి దీపోత్సవంలో 50 మంది ఆర్య వైశ్య దంపతులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా, ఉపాధ్యక్షులు కొల్లిపర నరసింహారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతల పూడ్చివేతకు చర్యలు

నాగాయలంక: నాగాయలంక-సొర్లగొంది మార్గంలో తలగడదీవి గ్రామ సమీపంలో ప్రధాన రోడ్డుపై ఏర్పడిన ప్రమాదకరమైన గుంతను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావుతో కలిసి అవనిగడ్డ డీఈఈ జి.వరలక్ష్మి గురువారం పరిశీలించారు. డ్రెయినేజీ తూము కారణంగా రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడిందని డీఈఈకి శేషగిరి వివరించారు. సంగమేశ్వరం రోడ్డులో కూడా కమ్మనమోలు గ్రామం దాటాక రహదారి మధ్యలో ఇలాంటి రంధ్రమే ఏర్పడిందని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించిన ఆమె మాట్లాడుతూ త్వరితగతిన రోడ్లపై గుంతలు పూడ్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. బర్రంకుల పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు పాల్గొన్నారు.

కార్తిక దీపోత్సవం



కోడూరు: కోడూరు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం రాత్రి కార్తిక దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో లింగాకృతి, కనకదుర్గమ్మ అమ్మవారి రంగవల్లులను తీర్చిదిద్ది, వాటి చుట్టూ కార్తిక దీపాలు వెలిగించారు. స్వస్తిక్, ఓంకారం గుర్తులతో పాటు పలు ఆకృతుల్లో దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లక్ష బిల్వార్చన



పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని దుర్గా, పార్వతి సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఉదయం ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు జరిగాయి. సాయంత్రం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం లక్ష బిల్వార్చన నిర్వహించారు. రాత్రికి భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

ఆలయం హుండీలో నగదు మాయం

పెడన: గణేష్ నగర్‌లోని వినాయకుని ఆలయం హుండీలో నగదు మాయమైంది. బుధవారం అర్ధరాత్రి దుండగులు ఆలయానికి ఉన్న తాళాలను పగలగొట్టి లోపల ఉన్న హుండీకి వేసిన తాళాలను సైతం పగలగొట్టి హుండీలో నగదును మాయం చేశారు. ఆలయ నిర్వాహకులు నారగాని నాగరాజు గురువారం ఉదయం వేకువ జామున 4.30 గంటల సమయంలో ఆలయం తాళాలు తీయడానికి వెళ్లగా చోరీ జరిగినట్లు గుర్తించి 100కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. పెడన పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

రూ.3.60 కోట్లతో అభివృద్ధి పనులు

మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెడన పట్టణానికి మంజూరు చేయించిన రూ.3.60 కోట్ల నిధులతో పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో 16వ వార్డు మస్జిద్ ఏ మహమ్మదీయ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మున్సిపల్ ఏఈఈ కాగిత రామాంజనేయులుకు పలు సూచనలు చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పట్టణంలోని ప్రతి సచివాలయానికి రూ.40 లక్షల రూపాయలను మంత్రి జోగి రమేష్ మంజూరు చేయించారన్నారు.

తొమ్మిది సచివాలయాల పరిధిలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంతో పాటు తాగునీటి పైపులైన్లు, ఇతర పనుల కోసం రూ.3.60 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఏఈని ఆదేశించారు. పట్టణ సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు కోమట్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల యూత్ పార్లమెంట్

మచిలీపట్నంటౌన్: నగరంలోని కేంద్రియ విద్యాలయంలో గురువారం విద్యార్థులు యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు లోక్‌సభ స్పీకర్‌గా, ప్రధానిగా, మంత్రులుగా, ఎంపీలుగా పార్లమెంట్‌లో మాదిరిగా చర్చ చేపట్టారు. పార్లమెంట్‌లో జరిగే చర్చను విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని దేవరపల్లి అరుణకుమారి, పి. ప్రవీణ్ 50మందికి పైగా విద్యార్థులు యూత్ పార్లమెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికగా పార్లమెంట్ ఉందన్నారు. కేంద్రియ విద్యాలయంలో గురు వారం విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు 55 ప్రాజెక్టులను ప్రదర్శించారు.



యూత్ పార్లమెంట్ నిర్వహిస్తున్న దృశ్యం

చికిత్స పొందుతూ ఎలక్ట్రీషియన్ మృతి

కోనేరుసెంటర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎలక్ట్రీషియన్ గురువారం మృతి చెందాడు. పెడన మండలం కొంకేపూడి పంచాయతీ కట్లపల్లికి చెందిన పామర్తి నరసింహారావు (33) ఎలక్ట్రికల్ వర్కులు చేస్తుంటాడు. కొంతకాలంగా బందరు మండలం పోతిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని శ్రీనివాస నగర్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. నవంబర్ 28వ తేదీన నరసింహారావు కట్లపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా మాచవరం మెట్టు వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయాడు. స్పృహ కోల్పోయిన ఆయనను చికిత్స నిమిత్తం స్థానికులు మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు విజయవాడకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరసింహారావు గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ది మచిలీపట్నం కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం. 4783.
ESTD : 1920
హెడ్ ఆఫీస్ : కొత్తపేట, మచిలీపట్నం. - ఫోన్ : 223414, సెల్ : 8977876456

మహాజన సభ నోటీసు

ది మచిలీపట్నం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.4783, మచిలీపట్నం మెంబర్ల మహాజన సభ సమావేశము ది.27-12-2023 బుధవారము ఉదయం గం.11-30 ని॥లకు బ్యాంక్ ప్రధాన కార్యాలయము, ... మచిలీపట్నం నందు ఈ క్రింది చర్చనీయాంశములు చర్చించుటకు గాను ఏర్పాటు చేయడమైనది. కావున బ్యాంకు 'A' క్లాస్ సభ్యులు యావన్మంది మహాజన సభకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము.

చర్చనీయాంశములు :- (1) బ్యాంక్ నందు చేర్చుకొనబడిన 'A' క్లాస్ సభ్యత్వములను మరియు పేరుదనముల వాపసును ఆమోదించుట. (2) బ్యాంక్ ద్వారా మంజూరు చేయబడిన ఋణములు ఆమోదించుట. (3) బ్యాంక్ స్వీకరించిన డిపాజిట్లను ఆమోదించుట. (4) బ్యాంక్‌వారు Krishna DCC, IDBI, SBI, INDIAN బ్యాంక్‌ల నందు మరియు గవర్నమెంటు సెక్యూరిటీలయందు పెట్టిన పెట్టుబడులు ఆమోదించుట. (5) బ్యాంక్ నందు వాయిదా మీరిన బకాయిదారుల జాబితాను పరిశీలించి, ... లీగల్ చర్యలు తీసుకొనుట. (6) చైర్‌పర్సన్ వారి అనుమతితో ప్రవేశపెట్టబడు ఇతర అంశములు.

వై. రాజకుమార్ ముఖ్యకార్యనిర్వహణాధికారి /CEO మచిలీపట్నం, తేది 30-11-2023

100 సం॥ల మచిలీపట్నం ప్రజలకు సేవలందిస్తున్న బ్యాంక్ మన అర్బన్ బ్యాంక్, బ్యాంకు అభివృద్ధికి సహకరించుచున్న డిపాజిటర్లకు, ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదములు.....

సదా మీ సేవలో : ది మచిలీపట్నం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్,

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983, 99122 20545 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com